క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థుల ఎత్తు, బరువు చూస్తున్న సిబ్బంది

జలుమూరు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, సీఆర్‌పీ పట్ట వైకుంఠరావు అన్నారు. మండలంలోని తమ్మయ్యపేట పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఎత్తు, బరువు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేష్

ఆమదాలవలస: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సంకల్పం పేరిట గంజాయి, వివిధ రకాల మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందని హెచ్చరించారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. 18 సంవత్సరాల లోపు విద్యార్థులు లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం కేపీ రాములు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న హిమబిందు

నరసన్నపేట: బాలికలకు గుడ్‌టచ్, బాల్య వివాహాలు, స్వీయ రక్షణలపై పూర్తి అవగాహన కల్పించాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ వై.హిమబిందు సూచించారు. మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వరకట్న వేధింపులు జరిగితే సమాచారం ఇవ్వాలని, గృహ హింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వకులా రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: కిశోర బాలికల హక్కులు, బాలికల చట్టాలపై స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీవో ఎస్.అనూరాధలు గ్రామ స్థాయి రీసోర్స్ గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికల చదువు, ఆరోగ్యం, రుతుక్రమం, పరిశుభ్రత, అక్రమ రవాణా, స్వీయరక్షణ, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ నేరాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, ఏపీఎం మూర్తి, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు తల్లిదండ్రులు హాజరవ్వాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కరుణాకరరావు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి, వెటర్నరీ ఏడీ ఎం.కరుణాకరరావు సూచించారు. మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో చంద్రకుమారితో కలిసి ఉపాధ్యాయులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో ప్రోగ్రెస్ కార్డులు, హెల్త్ కార్డులను విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పవర్..!



లక్ష్మీనర్సుపేటలో నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్డు

- సర్పంచ్‌ల అధికారాలకు చెక్
- వెండర్‌కు అభివృద్ధి పనులు
- 2014–19 మధ్య జన్మభూమి కమిటీలు

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలోని కూటమి పాలనలో సర్పంచ్‌ల అధికారాలకు చెక్ పెట్టారు. రాజ్యాంగ బద్ధంగా ప్రజలతో నేరుగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు గ్రామ పరిపాలనతో సంబంధం లేకుండా కూటమి ప్రభుత్వం పక్కన పెట్టేసింది. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పనుల ఎంపిక,



దబ్బపాడులో చేపడుతున్న పనులు

మంజూరు, వాటిని పూర్తి చేసే బాధ్యతలు కొత్తగా ఏర్పాటు చేసిన వెండర్‌కు అప్పగించారు. దీంతో ఎన్నికల ముందు గ్రామ స్వరాజ్యం తీసుకొస్తామని చెప్పిన కూటమి పార్టీల నాయకులు, అధికారం చేపట్టిన తర్వాత సర్పంచ్‌లకు పవర్ లేకుండా చేశారని వారు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల అభివృద్ధిలో ఎంతో కీలకమైన పంచాయతీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపణలు చేస్తున్నారు.

అప్పట్లో జన్మభూమి కమిటీలు

రాష్ట్రంలో 2014–19 మధ్యకాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి వారితోనే అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలన్నా జన్మభూమి కమిటీ తీర్మానం తప్పనిసరి చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే సర్పంచ్‌ల కంటే పూర్తి పవర్ జన్మభూమి కమిటీల చేతిల్లోనే ఉండేది. ఇప్పుడేమో వెండర్‌కు అభివృద్ధి పనుల బాధ్యతలు అప్పగించారు. ప్రజలతో నేరుగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లను పక్కన పెట్టి, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెండర్‌కు అప్పగించారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం



సర్పంచ్‌లను పక్కన పెట్టి వెండర్‌కు అభివృద్ధి పనులు అప్పగించడం అంటే పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే. రాజ్యాంగబద్ధంగా ప్రజలతో నేరుగా ఎన్నికైన సర్పంచ్‌లతో పని లేకుండా గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయడం చేయడం సరికాదు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలి. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేలా నిర్ణయం తీసుకోవాలి.

బలగ లక్ష్మి, సర్పంచ్, శ్యామలాపురం ఆర్‌ఆర్ కాలనీ, ఎల్.ఎన్.పేట

వెండర్‌కు అప్పగించాం



ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కేంద్రం పొందుపర్చిన కొత్త విధానాలకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు వెండర్‌కు పనులు అప్పగించాం. గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ తీర్మానాలను సర్పంచ్‌ల అధ్యక్షతన, వారి సూచనలు ప్రకారమే చేయిస్తున్నాం. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ నిధులతో నిర్మాణం పనులు వెండర్‌కు ఇచ్చి చేయిస్తున్నాం.

పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, ఎల్.ఎన్.పేట

నియోజకవర్గంలో...

మండలం	ఎల్.ఎన్.పేట	హిరమండలం	కొత్తూరు	మెళియాపుట్టి	పాతపట్నం
పంచాయతీలు	22	23	43	37	34
మంజూరైన పనులు	66	51	100	75	91
నిధులు(రూ.కోట్లలో)	3.78	3.06	4.09	4.57	5.30

మురుగునీటిలో కుళాయిలు



మెళియాపుట్టి మండలంలోని సంతలక్ష్మీపురం గ్రామంలో కుళాయి పైప్‌లైన్లు మురుగు నీటిలోనే ఉన్నాయి. గ్రామంలోని రహదారి పక్కనే ఉన్న వీధికి డ్రైనేజీలు లేక పోవడంతో వాడుక నీరంతా ఇళ్ల ముందే నిల్వ ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే దోమల వలన ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు. - మెళియాపుట్టి

పశు గణన పరిశీలన



జిల్లావ్యాప్తంగా పశుగణన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని జిల్లా నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. చల్లవానిపేటలో జరుగుతున్న పశు గణన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 41 శాతం పూర్తి అయ్యిందన్నారు. 2025 ఫిబ్రవరి నాటికి సర్వే పూర్తి చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీ లోకనాథం, వైద్యులు ఎం.దీప్తి, సర్పంచ్ పంచిరెడ్డి రామ చంద్రరావు సిబ్బంది పాల్గొన్నారు. - జలుమూరు

విద్యార్థులకు రక్త పరీక్షలు



సారవకోట మండలంలోని సవరబొంతు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గురు, శుక్రవారాల్లో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ పాఠశాలలో చదువుతున్న ఒక బాలికకు ఇటీవల జ్వరం రావడంతో పరీక్షలు నిర్వహించగా, మలేరియాగా నిర్ధారణ జరిగింది. దీంతో పాతపట్నం సీహెచ్‌సీ మలేరియా యూనిట్ అధికారి శ్రీనివాసరావు సూచన మేరకు బొంతు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. అయితే రక్త పరీక్షల్లో ఎవరికీ మలేరియా నిర్ధారణ కాలేదని వైద్య సిబ్బంది తెలియజేశారు. - సారవకోట

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

పాతపట్నం: అవగాహనతో ఎయిడ్స్‌ను దూరం పెట్టవచ్చని సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ బాబురావు అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామ సచివాలయంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి వచ్చిన తర్వాత నివారణకు తీసుకునే చర్యలు కంటే, వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం ముఖ్యమన్నారు. ప్రతి గర్భిణీ ఎయిడ్స్ పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ హెచ్.నాగభూషణరావు, సర్పంచ్ జె.ఉమ, మాజీ సర్పంచ్ ఎం.రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తాతయ్య, ఎం.కృష్ణారావు, సెక్రటరీ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి రిసోర్స్ పర్సన్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా ఉండాలని, మద్యానికి దూరంగా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి, రెడ్ రిబ్బన్ కో–ఆర్డినేటర్ వి.ఉషాపద్మిని, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

14న జాతీయ లోక్ అదాలత్

పాతపట్నం: స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి, నరసన్నపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హిరిప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పురపాలక సంఘంలోని నాలుగో వార్డు గేదెలవానిపేట వద్దనున్న స్వయంభు ఉమామహేశ్వర స్వామి పీఠం ప్రాంగణంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆలయాలను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మికతతో మెలిగేవారికి క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. ప్రకృతితో మమైకమై ఉండే హైందవ ధర్మం గొప్పతనం నేటితరం పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని సూచించారు. అర్చకులు బంకుపల్లి రామచంద్రమూర్తి శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇంజరాపు విశ్వనాథం, కూటమి పార్టీ నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

తొలగిన ఇబ్బంది

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస – పెదవెంకటాపురం పొలాల మధ్య ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభాలు అన్న శీర్షికతో ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా ట్రాన్స్‌కో యంత్రాంగం వాలిపోయి ఉన్న 4 స్తంభాలను సరిచేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్



సరిచేసిన విద్యుత్ స్తంభాలు

దళితులపై కక్ష సాధింపు తగదు

నరసన్నపేట: రాష్ట్రంలోని దళితులపై కక్ష సాధింపు చర్యలు సరికావని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాలకు చెందిన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సతివాడ రామినాయుడు, కోటిపల్లి లక్ష్మణరావు, పి.తవిటినాయుడు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు కోటిపల్లి శ్రీను, మండల ప్రతినిధి మచ్చ గణేష్‌లు విలేకరులతో మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న కక్ష సాధింపులను తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళిత నాయకులు, అధికారులపై కక్ష సాధింపులకు దిగడం, అక్రమ కేసులు బనాయించడం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టి నెలల తరబడి జైళ్లల్లో ఉంచుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయడం లేదని దుయ్యబట్టారు.

ఇటువంటి కక్ష సాధింపులకు ఇకనైనా స్వస్తి చెప్పాలని హితవు పలికారు. దళిత కుటుంబాలకు ఇచ్చే విద్యుత్ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయవద్దని కోరారు.



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ ప్రతినిధులు

'క్యూ ఆర్ కోడ్‌తో బిల్లులు చెల్లించవచ్చు'

ఆమదాలవలస: విద్యుత్ వినియోగదారులు కరెంటు మీటర్ బిల్లు తీసిన వెంటనే ఆ బిల్లు కింద ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ జి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంలో స్కాన్ చేసే సదుపాయం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.చంద్రకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు హాజరవ్వాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ఆమదాలవలస: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతిని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



నరసన్నపేట: లక్ష్మీ టాకీస్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పొందూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



సారవకోట: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సరుబుజ్జిలి: బురిడివలసలో నివాళులర్పిస్తున్న దళిత నేతలు



బూర్జ: ఏబీసీ పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెచ్‌సీ తిరుపతిరావు తదితరులు



పాతపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాల మహానాడు సంఘం సభ్యులు



కొత్తూరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘం నేతలు



జలుమూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులు ప్రారంభం



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరమ్మ



సారవకోట: బొంతు గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

కొత్తూరు: మండలంలోని పొనుటూరు, రాయల గ్రామాల్లో తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వీర్వోలు రాజగోపాలరావు, ఉమారాణి, ఎద్దు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని టెక్కలిపాడు గ్రామంలో తహసీల్దార్ జెన్ని రామారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఆర్‌ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రైతులకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ సదస్సులు ద్వారా పరిష్కరించుకోవచ్చునని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తహసీల్దార్ ఎల్.మధుసూదన, ఎంపీడీవో పావని, కిల్లి సిద్ధార్థ, కిల్లి లక్ష్మణరావు, కిల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని బొంతు, సవరబొంతు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు నూకయ్య, బాలరాజు, గజపతి నారాయణ తదితరులున్నారు.

నరసన్నపేట: మండలంలోని గొట్టిపల్లిలో రెవెన్యూ సదస్సులను జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి అనూరాధ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్ అప్పలస్వామి, సర్పంచ్ అవ్వ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, సర్పంచ్ జక్కర ఉమా, మద్దు తాతయ్య, మద్దు రామారావు, మండల సర్వేయర్ రామగణపతి, మంచు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి, గోకర్ణపురం గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెద్దకొల్లివలస గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.గవరయ్య, సర్వే డీటీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.